సాక్షి
అనంతపురం
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



నిప్పు పెట్టేదే.. చేతనైంది చేసుకో

తాడిపత్రి ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి గడ్డివామికి టీడీపీ నాయకుడు నిప్పు పెట్టాడు. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.3°/16.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఉద్యమంలా నులి పురుగుల నిర్మూలన



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, ఇతర అధికారులు

అనంతపురం అర్బన్: పిల్లలలో నులిపురుగులు నిర్మూలించే కార్యక్రమం జిల్లాలో ఉద్యమంలా సాగాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడుపులో నులిపురుగుల కారణంగా పిల్లల్లో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కాబట్టి ఏడాది వయసున్న పిల్లల నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు వేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పిల్లలకు మాత్రలు ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు మాత్రలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలందించడమే లక్ష్యం



డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎం రవీంద్ర, కలెక్టరేట్ సిబ్బంది

అనంతపురం అర్బన్: ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని నూతన డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి అన్నారు. డీఆర్‌ఓగా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల సంస్థ డీఎం జె.రవీంద్ర, రిటైర్డ్ తహసీల్దార్ కె.శ్రీధర్, కలెక్టరేట్ ఎ-సెక్షన్ డీటీలు ఆంజనేయులు, లీలాకాంత్, వివిధ మండలాల తహసీల్దార్లు డీఆర్‌ఓకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందన్నారు. విధి నిర్వహణలో కచ్చితత్వం పాటిస్తూ అందరి సహాయ సహకారాలతో ముందుకు వెళతామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విమర్శలకు తావివ్వకుండా బాధ్యతలు నిర్వర్తిస్తామన్నారు.

మెరిట్ లిస్టు విడుదల

అనంతపురం మెడికల్: జిల్లా క్షయ వ్యాధి నివారణ విభాగంలో వివిధ పోస్టులకు భర్తీకి సంబంధించి అభ్యర్థుల మెరిట్ లిస్టును అనంతపురం వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. మెడికల్ ఆఫీసర్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, టీబీ, హెచ్‌ఐవీ సూపర్‌వైజర్, జిల్లా పీపీఎం కో ఆర్డినేటర్, అకౌంటెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 7న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

గడువులోపు పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: 'స్పందన' అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో నేరుగా, గ్రామ, సచివాలయాల్లో (వర్చువల్/జూమ్) కలిపి మొత్తం 134 అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడారు. అనంతరం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే 'జిల్లా పోలీసు స్పందన' విభాగం 93929 26803కు తెలియజేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరాలకు సంబంధించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.cybercrime.gov.in ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) కానీ, టోల్ ఫ్రీ నంబర్ 1930కు కానీ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఏ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరులో ఏర్పాటు చేసిన డ్రిప్ పరిశ్రమ

పారిశ్రామిక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు అందించి పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు విస్తృతంగా ఏర్పాటయ్యాయి. కోవిడ్ కష్టకాలంలో మూతపడిన పరిశ్రమలకు సైతం ఆర్థిక చేయూతనందించి అండగా నిలిచింది.

పారిశ్రామిక ప్రగతి

- ఉమ్మడి జిల్లాలో వెల్లువలా యూనిట్లు
- నాలుగేళ్లలో 900 పరిశ్రమల ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి
- ఉపాధి అవకాశాలతో జీవన ప్రమాణాలు మెరుగు

అనంతపురం టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తొలినాళ్ల నుంచి పారిశ్రామిక రంగ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనువైన జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారు. అందులో భాగంగానే ఉమ్మడి అనంతపురం జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి పెద్ద పీట వేశారు. 2019–23 మధ్య కాలంలో రూ.409 కోట్ల పెట్టుబడులతో 900 పైగా పరిశ్రమలు నెలకొల్పారు. ప్రత్యక్షంగా 12,500మందికి పైగా యువత స్థానికంగానే ఉపాధి పొందుతోంది. పరోక్షంగా 25వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. వీటితో పాటు సేవారంగంలో 2వేలకు పైగా యూనిట్లను మంజూరు చేశారు. ప్రత్యేకంగా అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం కప్పల బండ, హిందూపురం మండలం కొటిపి, ఆర్.అనంతపురం గ్రామాల్లో నాలుగు ఎంఎస్ ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పార్కులు ఏర్పాటు చేశారు. ఇందులో యూనిట్లు స్థాపించాలనుకునే పారిశ్రామిక వేత్తలకు రాయితీతో స్థలాలు కేటాయించి ప్రోత్సహిస్తున్నారు.

20 మందికి ఉపాధి



డ్రిప్ తయారీ పరిశ్రమ కోసం పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు మంజూరు చేశారు. 2021–22ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షల పెట్టుబడితో నిర్మాణ పనులు పూర్తి చేశాం. ప్రస్తుతం డ్రిప్ పరికరాలను తయారు చేస్తున్నాం. మా కంపెనీలో స్కిల్డ్, అన్ స్కిల్డ్ మొత్తం 20 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇక్కడ తయారైన పరికరాలను ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లాకు ఎగుమతి చేస్తున్నాం. ఇటీవలే పరిశ్రమల శాఖ అధికారుల సిఫార్సుతో ప్రభుత్వం నుంచి రాయితీ రూపంలో రూ.12లక్షలు మంజూరైంది.

– కుళ్లాయప్ప, నేహా ఇండస్ట్రీస్, పుట్లూరు

పారిశ్రామిక పాలసీ బాగుంది



పరిశ్రమ ఏర్పాటు కోసం ఇండస్ట్రియల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నా. వెంటనే పరిశ్రమల శాఖ అధికారులు ఫోన్‌లో సంప్రదించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు అందించే రాయితీలు, ప్రోత్సాహకాల గురించి తెలిపారు. పెనుకొండ సమీపంలో పరిశ్రమ ఏర్పాటు కోసం స్థలం కేటాయించారు. వెంటనే యూపీవీసీ ఇంటి ఉపకరణాల పరిశ్రమ ఏర్పాటు చేశాను. పరిశ్రమల స్థాపనకు సంబంధించి కర్ణాటకలో కంటే ఏపీలోనే పారిశ్రామిక పాలసీ బాగుంది.

– డాక్టర్ నాగేంద్ర, పారిశ్రామికవేత్త, బెంగళూరు

పారిశ్రామికవేత్తలకు సహకారమందిస్తాం



పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తాం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారి సమీపంలో ఉండే స్థలాలను ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పార్కులను అభివృద్ధి చేస్తోంది. పరిశ్రమల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థలాలు కేటాయిస్తున్నాం. వీటితోపాటు ప్రభుత్వం అందించే రాయితీలను సైతం సకాలంలో అందిస్తాం.

– నాగరాజరావు, పరిశ్రమల శాఖ, జీఎం అనంతపురం

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



ఆత్మకూరు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్/ ఆత్మకూరు: ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు 594 మంది విద్యార్థులకు గాను 572 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 345 మంది విద్యార్థులకు గాను 334 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం విడతలో 245 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ తెలిపారు. ఆత్మకూరు కేజీబీవీని వెంకటరమణనాయక్, డీఈసీ సభ్యుడు శంకరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ మీడియాతో మాట్లాడుతూ ఒకేషనల్ విద్యార్థులకు 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. జనరల్ పరీక్షలు 11వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో 142 కళాశాలలు ఉన్నాయని, అందులో 70 కళాశాలల్లో జనరల్ పరీక్షలు, 20 కళాశాలల్లో ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఫస్టియర్ జనరల్ పరీక్షలకు 22,378 మంది విద్యార్థులు, ఒకేషనల్ పరీక్షలు 2,068 మంది విద్యార్థులు రాస్తున్నారన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలు 15,992 మంది విద్యార్థులు, ఒకేషనల్ పరీక్షలు 1,118 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్ శంకరయ్యతో కలిసి 'నాడు– నేడు' పనులను పరిశీలించారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియా దేవి

అనంతపురం అర్బన్: అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్ జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, పౌర సరఫరాల సంస్థ డీఎం రవీంద్ర, డిప్యూటీ కలెక్టర్లు, ఆనంద్, నీలమయ్యతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 364 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 'స్పందన' అర్జీల్లో ఏ ఒక్కటీ రీ–ఓపెన్ కాకూడదన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అర్జీదారులకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అర్జీల పరిష్కారంపై అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్షించాలని ఆదేశించారు.

అర్జీల్లో మచ్చుకు కొన్ని..

తల్లిదండ్రుల ద్వారా సక్రమించిన భూమిలో తనకు రావాల్సిన భాగాన్ని ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఎం.సునీత అనే మహిళ అర్జీలో కోరారు. కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లి పొలం వివిధ సర్వే నంబర్లలో 14.78 ఎకరాల భూమి తమకు తల్లిదండ్రుల నుంచి సంక్రమించిందన్నారు. ఇందులో తనకు భాగం ఉన్నప్పటికీ ఇవ్వకుండా అడ్డుపడుతున్నారన్నారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.

- తన తండ్రి పేరున ఉన్న భూమిని వేరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించారని పెద్దవడుగూరు మండలానికి చెందిన రామకృష్ణ ఫిర్యాదు చేశారు. చిత్రచేడు గ్రామ పొలం సర్వే నంబరు 65లో 10.99 ఎకరాల భూమి ఈసీ, ఆర్‌హెచ్ రికార్డుల్లోనూ తన తండ్రి పేరు ఉందన్నారు. అయితే ఈ భూమిని వేరొక వ్యక్తి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, దీనిపై విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.
- దివ్యాంగురాలైన తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని అనంతపురంలోని గుత్తిరోడ్డు యల్లమ్మకాలనీలో నివాసముంటున్న గోవిందమ్మ అనే వివాహిత విజ్ఞప్తి చేశారు. ఇంటర్ వరకు చదువుకున్నానని, తగిన ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల నేపథ్యంలో బదిలీపై జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి ఎన్నికలు, రీ-సర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, కులగణన, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం తహసీల్దార్లు తమ మండల పరిధిలో బీఎల్‌ఓలు, ఎంపీడీలు, మునిసిపల్ కమిషనర్లతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంపై సమీక్షించాలన్నారు. గత ఏడాది డిసెంబరు 9 నుంచి ఇప్పటి వరకు పోలింగ్ కేంద్రాల వారీగా డేటా పరిశీలించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి రోజువారీగా సమీక్షిస్తూ ఉండాలని చెప్పారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేయాలి

ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో కలిసి మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను వారంలోగా తనిఖీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. వసతులు ఉన్నాయా లేదా పరిశీలించి లేనిచోట ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు.

సీఎం సభకు ముమ్మర ఏర్పాట్లు



డీఎస్పీలు, నాయకులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం

- 11న రాప్తాడులో సిద్ధం సభ

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11న రాప్తాడు మండల కేంద్రంలోని ఆటో నగర్ సమీపాన రాయలసీమ స్థాయిలో 'సిద్ధం' బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభ ఏర్పాట్లను సోమవారం సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్/ ఎమ్మెల్సీ తలశిల రఘురాం పరిశీలించారు. నేల చదును, టెంట్లు, సభాస్థలి ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు.

డీఎస్పీలతో సమీక్ష

బహిరంగ సభాస్థలి వద్ద అనంతపురం, రూరల్ డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, వెంకటశివారెడ్డితో కో ఆర్డినేటర్ తలశిల రఘురాం సమీక్షించారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీ పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, సభాస్థలి, హెలిప్యాడ్, ట్రాఫిక్ ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయయాదవ్, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి, అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్లు జూటూరు శేఖర్, గోవింద్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ చిత్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకులు చిత్రా వెంకటేష్, పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలువుల జాతర

- పశుసంవర్ధక శాఖలో 442 వీఏహెచ్ఏ పోస్టుల భర్తీ
- రెండు విడతల్లో సాఫీగా ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన
- సీఎం జగన్‌కు రుణపడి ఉంటామంటున్న వీఏహెచ్ఏలు

పశు సంవర్ధక శాఖలో కొలువుల జాతర జరుగుతోంది. సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా పశు సంవర్ధక శాఖ పరిధిలో మిగిలిపోయిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు నెల రోజులుగా పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా కొనసాగిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం నియామకాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారం రోజుల్లో నియామక పత్రాలు, ప్లేస్‌మెంట్లు ఇవ్వనున్నారు.



అనంతపురం అగ్రికల్చర్: రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) వేదికగా పశు వైద్యం, పశు సంవర్ధక శాఖ తరఫున ప్రభుత్వ పథకాలు అమలు చేసి పాడి రైతులు, జీవాల కాపర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పశు సంవర్ధక సహాయకుల (వీఏహెచ్ఏ)ను నియమిస్తోంది. రాష్ట్రంలో ఏ జిల్లాకూ లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు 692 పోస్టులు కేటాయించారు. సచివాలయ వ్యవస్థ ప్రక్రియలో భాగంగా మూడేళ్ల కిందట మొదటి విడతగా 219 మంది వీఏహెచ్ఏలను నియమించారు. సంబంధిత కోర్సులు, విద్యార్హత లేని కారణంగా 473 పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి.

- రెండేళ్ల తర్వాత ఈ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రెండేళ్ల కాలంలో సంబంధిత కోర్సు చేసిన 926 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత డిసెంబర్ 31న ఏడు కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో 150 మార్కులకు పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు 919 మంది హాజరయ్యారు. రోస్టర్, మెరిట్ ఆధారంగా డైరెక్టరేట్ పరిధిలో మొదటి విడతగా 206 మంది అభ్యర్థులు, రెండో విడతగా 240 మంది అభ్యర్థులను అర్హులుగా ప్రకటించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అర్హత పొందిన 446 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను నాలుగు నుంచి ఆరు బృందాలు మూడు రోజుల పాటు నిశితంగా పరిశీలించి 442 పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేశారు.
- ఎంతోకాలంలో ఎదురుచూస్తున్న వీఏహెచ్ఏ కొలువులు భర్తీ చేపట్టడంతో నిరుద్యోగ యువతతో పాటు గత 15 సంవత్సరాలు పశు సంవర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న గోపాలమిత్రలు కూడా హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. గోపాలమిత్రలకు అదనంగా 15 మార్కులు కలపడంతో 70 మందికి పైగా గోపాలమిత్రలు ఇపుడు వీఏహెచ్ఏలుగా నియమితలవుతున్నారు. కొత్తగా పోస్టులు పొందిన వారిలో ఎస్సీ, ఎస్టీలు 90 మంది, బీసీలు 140 మంది ఉన్నారు. ఇందులో సగం మంది వరకు మహిళా అభ్యర్థులు ఉండటం విశేషం.

ఆనందంగా ఉంది



ప్రభుత్వం, డైరెక్టరేట్, కలెక్టర్ ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా పాటించి అత్యంత పారదర్శకంగా వీఏహెచ్ఏల నియామక ప్రక్రియ చేపట్టాం. ఒకేసారి 442 మంది పశుశాఖ తరఫున ఉద్యోగాలు పొందారు. చాలా ఆనందంగా ఉంది. ఇక నుంచి పశు సంవర్ధక శాఖ తరఫున పాడి రైతులు, జీవాల కాపర్లకు మున్ముందు మరింత మెరుగ్గా సేవలు అందిస్తాం.

– డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్, ఉమ్మడి అనంతపురం జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీలు

ప్రభుత్వానికి మంచి పేరు తెస్తాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యువత తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఒకే విడతలో ఇంతమందిని ప్రభుత్వ ఉద్యోగాల్లోకి తీసుకోవడం శుభపరిణామం. డిగ్రీ, పీజీలు పూర్తి చేసి ఉద్యోగాల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్న మాలాంటి యువతకు పశు శాఖలో కొలువులు కల్పిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. రాయదుర్గంలో వలంటీరుగా పనిచేస్తున్న నేను వీఏహెచ్ఏ పోస్టుకు ఎంపికవడం సంతోషంగా ఉంది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పని చేస్తా.

– హెచ్.మంజుల, టి.వీరాపురం, రాయదుర్గం మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం అంటే ఇపుడున్న పరిస్థితుల్లో చాలా కష్టమైన పని. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఆయనకు రుణపడి ఉంటాం. డిగ్రీ పూర్తి చేయడంతో పాటు వీఏహెచ్ఏ పోస్టుకు రెండేళ్ల వెటర్నరీ కోర్సు చేశాను. అమ్మా, నాన్న కూలి పనులు చేస్తూ చదివించారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు.

– విశ్వనాథ్, తాడిపత్రి

ఏపీ ఈసెట్ కార్యాలయం ప్రారంభం



ఈసెట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ జీవీఆర్ శ్రీనివాసరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం నూతన పాలక భవనంలో ఏపీ ఈసెట్ - 2024 కార్యాలయాన్ని సోమవారం ఏపీ ఈసెట్ రాష్ట్ర చైర్మన్/ జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జీవీఆర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఏపీ ఈసెట్ బాధ్యతను జేఎన్‌టీయూఏకు అప్పగించారు. ఇది వరకు ఏడు దఫాలు ఈసెట్‌ను జేఎన్‌టీయూ నిర్వహించింది. తాజాగా ఎనిమిదో దఫా జేఎన్‌టీయూ(ఏ) నిర్వహిస్తోంది. ఇందులో ఆరు దఫాలు ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి ఈసెట్ కన్వీనర్‌గా ఉన్నారు. తాజాగా ఏడో దఫా కూడా రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కింది. ఈసెట్ రాష్ట్ర కన్వీనర్ భానుమూర్తి నూతన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకం ఉంచి ఈసెట్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, జేఎన్‌టీయూఏ వీసీ జీవీఆర్ శ్రీనివాసరావు, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ దిలీప్‌కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

26 నుంచి రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఈ నెల 26 నుంచి అనంతపురం వేదికగా రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీడబ్ల్యూజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్చి 3వ తేదీ వరకూ అనంత క్రీడాగ్రామం వేదికగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనే ఆసక్తి గల జర్నలిస్టులు అనంతపురంలోని తన కార్యాలయంలో వివరాలు అందజేయాలని కోరారు.

ఆటో బోల్తా - యువకుడి మృతి


మృతుడు రంజిత్ నాయక్

గుత్తి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం మైనాపురం తండాకు చెందిన రంజిత్ నాయక్ (20) శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమ ఎలక్ట్రికల్ విభాగంలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లేందుకు స్వగ్రామం నుంచి ఆటోలో బయలుదేరాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెరువు తండా సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రంజిత్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కర్నూలు జిల్లా జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి రామిరెడ్డి నాయక్, లక్ష్మీదేవి దంపతులు బోరున విలపించారు.

బీసీలను వంచించింది పరిటాల కుటుంబమే

- కుట్రలు.. కుతంత్రాలే పరిటాల అజెండా
- ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించం
- పరిటాల సునీతపై మండిపడిన వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మకూరు ఎంపీపీ సుబ్బర హేమలత

ఆత్మకూరు: కుట్రలు.. కుతంత్రాలే అజెండాగా ఆది నుంచి పరిటాల కుటుంబం మనుగడ సాగిస్తోందని, బీసీలను వంచించింది కూడా వారేనని ఆత్మకూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ప్రజాదరణను చూసి ఓర్వలేక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. దోచుకొని, దాచుకోవడం తప్ప పరిటాల కుటుంబానికి ఏమీ తెలియదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో గ్రామాల్లో కక్షలు ప్రేరేపించి రాజకీయ లబ్ధి పొందేందుకు జయహో బీసీ పేరుతో సభల నిర్వహణకు సిద్ధమవుతున్నారని విమర్శించారు.

తోపుదుర్తి కుటుంబం బీసీల పక్షపాతి

పాతికేళ్ల అధికారంలో ఉండి బీసీల పేరు చెప్పుకొని ప్రజలను నిలువునా దోచుకున్న నీచ చరిత్ర పరిటాల కుటుంబానిదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కనగానపల్లి ఎంపీపీ పదవిని బీసీలను కాదని దౌర్జన్యంగా తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కట్టబెట్టడం, ఓబులేష్ అనే వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. గతంలో బీసీలైన పార్థసారథి, కాలవ శ్రీనివాసులుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడానికి నిరాకరించిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు ఎంతో ప్రాధాన్యత చేకూరిందన్నారు. నియోజకవర్గంలో బీసీలకు అన్ని విధాలుగా అండగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నిలిచి, తాను బీసీల పక్షపాతినని నిరూపించుకున్నారన్నారు. మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ జనరల్‌కు వచ్చినా బీసీలకు పదవులు ఇచ్చిన ఘనత ఒక్క ప్రకాష్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో పరిటాల రవి హయాంలో రక్తం ఏరులై పారితే... తోపుదుర్తి హయాంలో శాంతి కుసుమాలు విరబూసాయన్నారు.

ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు?

అధికారంలో ఉన్నప్పుడు రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్న పరిటాల కుటుంబ సభ్యులు నేడు ప్రజల్లోకి ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారని ప్రశ్నించారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చారని, ఉచిత బోర్లు వేయించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. ప్రకాష్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పరిటాల సునీత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ చేయలేక పోతున్నామంటూ ఆనాడు అసెంబ్లీలో మంత్రిగా ఉన్న సునీత చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన ఒక్క మంచి పని ఏమిటో కూడా చెప్పుకోలేని దుస్థితిలో పరిటాల కుటుంబం ఉందని విమర్శించారు.

సునీత కుటుంబానికి వేల కోట్లు ఎలా వచ్చాయి?

రాజకీయాల్లోకొచ్చాక పరిటాల కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. పెనుకొండలో రూ.40 లక్షల బాడుగ వచ్చే భవనం, అనంతపురంలోని శాంతి థియేటర్ వద్ద పెద్ద బిల్డింగ్ నిర్మాణం, సూర్యనగర్‌లో నెలకు రూ.35 లక్షలు బాడుగలు వచ్చే బిల్డింగ్, నెలకు రూ.కోట్లు ఆదాయం సమకూరే బెంగళూరులోని పబ్బులు, కియా దగ్గర భూములు, పాలసముద్రం దగ్గర 70 ఎకరాలు, పాలచెర్ల వద్ద వంద ఎకరాలు, ముక్తాపురం దగ్గర 40 ఎకరాలు, నర్సంపల్లి వద్ద 70 ఎకరాలు, కురుగుంట వద్ద రూ.కోట్లు విలువ చేసే 11 ఎకరాలు, చిన్నంపల్లి వద్ద 40 ఎకరాలు, ఆకుతోటపల్లి, ఆజాద్ నగర్‌లో ఎకరా స్థలంలో ఇళ్లు, బెంగళూర్‌లో గెస్ట్ హౌస్ ఇవన్నీ తన బినామీ పేర్లతో లేవని చెప్ప ధైర్యం సునీతకు లేదన్నారు. వీటన్నింటికీ తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రకాష్‌రెడ్డిపై ఆధారాలు లేని విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తనకు సొంత ఇల్లు లేకపోయినా మహిళా పాడిరైతుల అభ్యున్నతికి రూ.20 కోట్లతో డెయిరీ ఏర్పాటు చేయించారన్నారు. ఆలయాలకు విరాళాలు, అభాగ్యులను ఆదుకోవడం ఇవన్నీ ప్రకాష్ రెడ్డి నిస్వార్థంతో చేసినవన్నారు. అభివృద్ధి చేస్తాడన్న నమ్మకంతోనే రాప్తాడు ప్రజలు 25 వేల మెజార్టీతో గెలిపించారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారన్నారు. సమావేశంలో ఎంపీపీ హేమలత, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, తోపుదుర్తి ఎంపీటీసీ పోతులయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, రంగంపేట సర్పంచ్ ఉజ్జినప్ప, బీసీ, ఎస్సీ,ఎస్టీ నాయకులు నరసింహులు, నాగరాజు, భాస్కర్, రాము నాయక్, సనప నరసింహులు, వెంకటేష్, శ్రీరామ్, టైలర్ వెంకటేష్, మురళి, వెంకటేష్, ఓబయ్య, రామాంజనేయులు, ఆంజనేయులు, బాబయ్య, గోవర్ధన్, పోతన్న పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

- జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ ఓబులు


మాట్లాడుతున్న డాక్టర్ ఓబులు

కూడేరు: మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ ఓబులు ఆదేశించారు. సోమవారం ఆయన కూడేరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఓపీ, రక్త పరీక్షలకు సంబంధించిన రిజిష్టర్లతో పాటు లేబర్, రోగుల వార్డును పరిశీలించారు. వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ల్యాబ్‌లో ఏఏ పరీక్షలు చేపడుతున్నది అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. దోమల నివారణ చర్యలపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలన్నారు. జ్వరాలు బారిన పడిన ప్రతి ఒక్కరికీ వెంటనే రక్త పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ అనంతరం చికిత్స అందజేయాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఫార్మసిస్టు వేణుగోపాల్, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

విడపనకల్లు: రోగులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఓబులు సూచించారు. సోమవారం విడపనకల్లు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. రోజు వారీ ఓపీపై ఆరా తీశారు. కార్యక్రమంలో స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌బాబు, పుష్ప, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కుట్ర భగ్నం

- నిందితుడి అరెస్ట్
- మారణాయుధం స్వాధీనం


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హతమార్చేందుకు పన్నిన కుట్రను తాడిపత్రి రూరల్ పోలీసులు భగ్నం చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, మారణాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీఎం గంగయ్య వెల్లడించారు.

ఫేస్‌బుక్‌లో పరిచయం

ఉరవకొండకు చెందిన నాగరాజు, సౌభాగ్య దంపతులు. 12 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మూడేళ్ల క్రితం సౌభాగ్యకు ఫేస్‌బుక్ ద్వారా గుంతకల్లు మండలం నక్కనదొడ్డికి చెందిన గోపాల్‌భాస్కర్‌తో పరిచయమైంది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం భర్తకు తెలియకుండా జాగ్రత్త పడిన సౌభాగ్య... ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న తాడిపత్రికి చేరుకుంటే జీవనం సాఫీగా సాగుతుందని నమ్మబలికింది. దీంతో కొన్ని నెలల క్రితం తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆర్డీటీ కాలనీలో అద్దె ఇంటికి నాగరాజు మకాం మార్చాడు. ఈ క్రమంలో తరచూ తన ప్రియుడితో ఆమె కలుస్తూ వచ్చింది.

విషయం బట్టబయలై...

తాను పని కోసం బయటకు వెళ్లిన సమయంలో మరో వ్యక్తితో తన భార్య సన్నిహితంగా ఉంటోందన్న విషయం నాగరాజు తెలిసింది. దీంతో నిఘా ఉంచిన నాగరాజు తన భార్య సాగిస్తున్న వివాహేతర సంబంధం గుర్తించి నిలదీశాడు. పద్ధతి మార్చుకోవాలని హితవు పలికాడు. ఈ విషయం తెలుసుకున్న గోపాల్‌భాస్కర్ ఎలాగైనా నాగరాజు అడ్డు తొలగించుకోవాలని సౌభాగ్యకు తెలియకుండా పథకం వేశాడు. ఈ నేపథ్యంలోనే పలువురితో కిరాయి చెల్లించేందుకు మంతనాలు జరిపాడు. అయినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తానే స్వయంగా రంగంలో దిగి నాగరాజును అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు.

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి

రోజూ ఉదయం నాగరాజు తాడిపత్రిలోని సాయి లక్ష్మి అపార్ట్‌మెంట్ వద్దకు రాకపోకలు సాగిస్తున్న విషయం తెలుసుకున్న గోపాల్‌భాస్కర్ ఎలాగైనా ఆ మార్గంలోనే తన పథకాన్ని అమలు చేయాలని భావించాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వేట కొడవలితో నాగరాజును హత్య చేసేందుకు అపార్ట్‌మెంట్ వద్ద కాపుకాశాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి దృష్టి గోపాల్‌భాస్కర్‌పై పడింది. ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో గోపాల్‌భాస్కర్‌ను అడ్డుకుని తనిఖీ చేయడంతో వేటకొడవలి బయటపడింది. వెంటనే గోపాల్‌భాస్కర్‌ని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి, తమదైన శైలిలో విచారణ చేయడంతో హత్య కుట్ర వెలుగు చూసింది. నిందితుడిని అరెస్ట్ చేసి, వేటకొడవలిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. సకాలంలో స్పందించి హత్య కుట్రను భగ్నం చేసిన సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీసీలు

అనంతపురం అర్బన్: బదిలీపై జిల్లాకు వచ్చిన డిప్యూటీ కలెక్టర్లు (డీసీలు) సోమవారం వారివారి బాధ్యతలు స్వీకరించారు. కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌ఆర్‌సీ) ఎస్డీసీగా జె.శిరీష, పీఏబీఆర్ ఎస్డీసీగా ఓ.రాంభూపాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉండగా హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్డీసీగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ సుధారాణి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆమె శింగనమల మండలం ఈఆర్ఓగా ఉన్నారు. ఈ క్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్డీసీ బాధ్యతలను డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్‌కు అప్పగిస్తూ కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కలెక్టరేట్‌లోని పరిపాలన- బడ్జెట్, శాంతిభద్రతలు- మెజిస్ట్రియల్, కో-ఆర్డినేషన్, భూపరిపాలన విభాగం, ఎన్నికల సెల్‌కు సూపరింటెండెంట్ల నియామకానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. చిత్తూరు నుంచి వచ్చిన తహసీల్దారు డి.రవికుమార్, కర్నూలు నుంచి వచ్చిన తహసీల్దార్లు కె.సతీష్, ఎస్.శ్రీనాథ్, వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చిన కె.విజయకుమార్, ఆర్.శేషరామ్‌సింగ్‌ను ఆయా విభాగాలకు సూపరింటెండెంట్లుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

రేపటి నుంచి పామిడి రైల్వే గేట్ మూత

అనంతపురం సిటీ: పామిడిలోని ఎద్దులపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వేగేట్‌ను నాలుగు రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ మేరకు సీనియర్ సెక్షన్ ఆఫీసర్ గడ్డం రవిబాబు సోమవారం తెలిపారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకూ అత్యవసర మరమ్మతుల కారణంగా గేట్‌ను మూసివేయనున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని వాహన చోదకులు, ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని కోరారు.

'దానిమ్మ'లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి




తెగుళ్ల ప్రభావంతో దెబ్బ తిన్న దానిమ్మ కాయలు

కళ్యాణదుర్గం: దానిమ్మ సాగులో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని కళ్యాణదుర్గం కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14,846 ఎకరాలలో దానిమ్మ సాగు ఉండగా, ఇటీవల తెగుళ్ల బెడద అధికంగా ఉందన్నారు. సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని హెచ్చరించారు. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఆమె వివరించారు.

- తెగుళ్లు ఆశించిన కొమ్మల భాగాలను అంగుళం కింద వరకూ కత్తిరించి కాల్చి వేయాలి.
- కొమ్మల కత్తిరింపు సమయంలో కత్తెర్లను 1 శాతం సోడియం హైపో క్లోరైట్ లేదా డెటాల్ లేదా స్పిరిట్‌లో ముంచి వాడుకోవాలి.
- కత్తిరింపులు చేసిన వెంటనే మొక్కలపై 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారీ చేయాలి.
- నేలపై రాలిన ఆకులు, తెగులు సోకిన కొమ్మలు, కాయలను పక్కకు తీసి కాల్చి వేయాలి.
- చెట్ల పాదుల్లో ఎకరాకు 8-10 కేజీల బ్లీచింగ్ పౌడర్ చల్లడం వలన రాలిన ఆకులలో ఉన్న బ్యాక్టీరియా నశిస్తుంది.
- కత్తిరింపుల తర్వాత వచ్చిన కొత్త చిగుర్లపై రోగ లక్షణాలు కనిపించిన వెంటనే పది లీటర్ల నీటిలో 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, 5 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ లేదా పోషామైసిన్ కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- పూత సమయంలో లీటరు నీటికి కాపర్ ఆక్సిక్లోరైడ్ బదులు కార్బెండజిమ్ 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి.
- పంట తర్వాత విశ్రాంతి సమయంలో కూడా మొక్కలపై 1 శాతం బోర్డో మిశ్రమం స్ప్రే చేయాలి.
- సిఫారసు చేసిన రసాయన ఎరువులతో పాటు పశువుల ఎరువు, జీవన ఎరువు అయిన ట్రైకోడెర్మా, సూడో మోనాస్ (కేవీకేలో అందుబాటులో ఉన్నాయి) కలిపి వేసుకుంటే మొక్క నిరోధక శక్తి పెరుగుతుంది.
- వీటికి తోడు సూక్ష్మపోషకాలైన లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల ఫెరస్ సల్ఫేట్, 2 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 1 గ్రాము బోరిక్ యాసిడ్ కలిపి చెట్లపై పిచికారీ చేయాలి.

యువతి ఆత్మహత్య

- ప్రేమికుడితో కాదని మరో యువకుడితో పెళ్లి ప్రయత్నాలు

తాడిపత్రి టౌన్: ప్రేమించిన యువకుడిని కాదని మరొకరితో పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించడంతో మనస్తాపం చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం పెద్ద ఎక్కలూరు గ్రామానికి చెందిన పుల్లయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె గంటల రాజేశ్వరి (19) గతంలో ఇంటి నుంచి పారిపోయి బెంగళూరుకు చెందిన ఓ యువకుడిని పెళ్లి చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బెంగళూరులో ఉన్న రాజేశ్వరిని గుర్తించి పిలుచుకొచ్చి మైనర్ కావడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ఇటీవల మరో యువకుడితో పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. గ్రామ వీఆర్వో మహమ్మద్ ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జనవాక్కు

రైతుల కష్టాలు తీర్చారు



వ్యవసాయం తప్ప మరో ఆధారం లేని రైతులను గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి చాలా పథకాలు తీసుకువచ్చారు. 90 శాతం సబ్సిడీతో నాకు డ్రిప్ మంజూరైంది. దీంతో బీర పంట సాగు చేసి రూ.6 లక్షల వరకు దిగుబడి సాధించాను. మళ్లీ అదే డ్రిప్‌తో ఇప్పుడు బ్యాడిగి మిర్చి సాగు చేశా. రైతుల కష్టాలు తీర్చిన జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే అన్నదాతలకు మేలు జరుగుతుంది కాబట్టి ఆయనకే మా మద్దతు.

– నారప్ప, కదదరకుంట, కూడేరు మండలం

జగనన్న మేలు మరువలేం



ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలు చేసిన సీఎం వైఎస్ జగన్ మేలును ఎన్నటికీ మరువలేం. నా భర్తకు పక్షవాతం రావడంతో ఆయనకు రూ.5వేలు పింఛన్ వస్తోంది. ప్రతి నెలా వచ్చే ఆ డబ్బుతోనే మేము సంతోషంగా జీవిస్తున్నాం. ఆ డబ్బే లేకపోయింటే మా పరిస్థితి ఘోరంగా ఉండేది. ఏమైనా ఆస్పత్రిలో చూపించుకోవాలన్నా.. మందులు తీసుకోవాలన్నా.. పింఛన్ డబ్బు బాగా ఉపయోగపడుతోంది. జగనన్న మేలు మరువలేం.

– లక్ష్మీదేవి, మున్నానగర్, అనంతపురం

చేయూతనిచ్చారు



కర్ణాటక సరిహద్దున మా గ్రామం ఉంది. ఏది కావాలన్నా సుదూరంగా ఉన్న మండల కేంద్రానికి వెళ్లాలంటే ఎంతో కష్టంగా అనిపించేది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో అన్ని పనులూ మా ఊళ్లోనే చక్కపెట్టుకుంటున్నాం. అంతేకాక మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 లబ్ధి చేకూరింది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాకు నగదును బదిలీ చేయడం ఎంతో బాగుంది. సీఎం జగన్‌కు అండగా నిలిచి ఆయన రుణం తీర్చుకుంటాం.

– గొల్ల లక్ష్మీదేవి, కె.పి.కుంట, గుమ్మఘట్ట మండలం

రూ.2 లక్షలకు పైగా లబ్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ.2,02,132ల లబ్ధి చేకూరింది. ఎలాంటి సిఫారసు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి చేకూర్చారు. ఇలాంటి ముఖ్యమంత్రి మరో పదికాలాల పాటు అధికారంలో ఉంటే రాష్ట్రంలో పేదరికం పూర్తిగా మటుమాయమవుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. అందుకే మేమంతా వైఎస్ జగన్‌కు అండగా ఉంటాం.

– సంజీవరెడ్డి, ఎస్.హొసళ్లి, గుమ్మఘట్ట మండలం

నిప్పు పెట్టేదే... చేతనైంది చేసుకో

- తాడిపత్రిలో కయ్యానికి కాలుదువ్వన టీడీపీ నేతలు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి గడ్డివామికి నిప్పు


బాధితున్ని పరామర్శిస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు టీడీపీ నాయకులు కుట్రలు పన్నారు. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడి కందిపంటకు నిప్పు పెట్టిన ఘటన మరవకనే సోమవారం తాడిపత్రి మండలం పులిప్రొద్దుటూరులో పార్టీ సానుభూతిపరుడి గడ్డి వామికి నిప్పు పెట్టారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు... పులిప్రొద్దుటూరుకు చెందిన ఎర్రగాంటి రమణారెడ్డి స్థానిక టీడీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి సమీపంలో పశువుల మేత కోసం గడ్డి వామి ఏర్పాటు చేసుకున్నాడు. అయితే రమణారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుల వెంట తిరగడం జీర్ణించుకోలేని చంద్రశేఖర్‌రెడ్డి ఎలాగైనా రమణారెడ్డిని దెబ్బ తీయాలని పథకం వేశాడు. ఈ క్రమంలోనే గడ్డివామిని తగులబెట్టాలని నిర్ణయించుకున్న ఆయన అందుకు సిద్ధమై సోమవారం తన ఇంటి పక్కన ఉన్న చెత్తకు నిప్పు పెట్టాడు. విషయం తెలుసుకున్న రమణారెడ్డి అక్కడకు చేరుకుని నిప్పు ఆర్పాలని, లేకుంటే గడ్డి వామి కాలుతుందని ప్రాధేయపడినా వినకుండా 'నిప్పు పెట్టేదే.. చేతనైంది చేసుకో' అంటూ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులూ దౌర్జన్యానికి దిగారు. కళ్లముందే గడ్డివామి తగులబడుతుంటే ఏమీ చేయలేని అసహాయ స్థితిలో రమణారెడ్డి ఉండిపోయాడు. చంద్రశేఖర్‌రెడ్డి దౌర్జన్యాన్ని సహించలేని గ్రామస్తులు వెంటనే సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఈలోపు గడ్డి వామి పూర్తిగా కాలిపోయి, దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె నాగేశ్వరెడ్డి, ఓబులరెడ్డి, బాబా, విజయకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పందన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు



స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న స్పందన కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలిసి మేయర్ తనిఖీ చేశారు. ప్రజాప్రతినిధులు చేసే ఫిర్యాదుల పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్పందన కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు అబూసలేహా, కమల్‌భూషణ్, బాలాంజనేయులు, సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంర్రెడ్డి ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన అగ్ని ప్రమాదం

కూడేరు: మండలంలోని కమ్మూరులో సోమవారం రైతు క్రిష్ణారెడ్డి, మరికొంత మంది రైతుల పంటల పొలాలకు అగ్ని ప్రమాదం తప్పింది. వంక వైపు వెళుతున్న వ్యక్తులు బీడీ లేదా సిగరేట్ తాగి పడేయడంతో వంకలోని ఎండుగడ్డి అంటుకుని మంటలు వ్యాపించాయి. గమనించిన రైతులు ఫైరింజన్‌కు సమాచారమిచ్చారు.ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పేసింది, అప్పటికే తోటల్లోని మోటర్లకు సంబంధించిన వైర్లు కాలిపోయాయి. పంట పొలాలకు ప్రమాదం తప్పడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

భద్రతా నియమాలు పాటించాలి




ర్యాలీని ప్రారంభిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతికనాజ్, ఆర్టీసీ డీఎం సురేష్

రాయదుర్గంటౌన్: రహదారి భద్రతా నియమాలు విధిగా పాటించాలని రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతికనాజ్, ఆర్టీసీ డీఎం సురేష్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని మోటార్ వెహికల్ కార్యాలయం నుంచి వినాయక సర్కిల్ వరకూ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రవాణా శాఖ ఆధ్వర్యంలో జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19 వరకూ భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. రోడ్డు నిబంధనలు పాటించడం, అవగాహన పెంచుకోవడం ద్వారానే ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రసాద్ బాబు, ఆటో డ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం

అనంతపురం సిటీ: అనంతపురం షిర్డీ నగర్‌లోని వివేకానంద యోగా కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం నాల్గో మహాసభ విజయవంతంగా ముగిసింది. బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం ప్రతినిధి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన మహాసభకు జిల్లా నలుమూలల నుంచి పెన్షనర్లు తరలివచ్చారు. పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. పెన్షన్ రివిజన్ సాధించుకునే వరకు పోరాడుదామని వక్తలు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖరరెడ్డి, సర్కిల్ కార్యదర్శి వెంకటేశ్వర రావు మాట్లాడారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.సుభాను రాయలసీమ జిల్లాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు.

శ్రీహరికోటను సందర్శించిన ఎస్ఆర్ఐటీ విద్యార్థులు



పారిశ్రామిక పర్యటనకు వెళ్లిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ విభాగానికి చెందిన విద్యార్థులు శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌ను (ఎస్‌డీఎస్‌సీ) సందర్శించారు. పరిశోధనలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. భారత దేశ అంతరిక్ష పరిశోధన సామర్థ్యాలు, ర్యాకెట్ ప్రయోగాలపై వివరించినట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ పారిశ్రామిక పర్యటన ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

7న రూరల్ పీఎస్‌లో వాహనాల వేలం

రాప్తాడురూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 7న వేలం వేయనున్నట్లు సీఐ రామకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఒక కారు, ఒక ఆటో, ఒక బైకు వేలం వేయనున్నామని, ఆసక్తిగల వారు ఉదయం 10:30 గంటలకు వచ్చి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చన్నారు.





అనంతపురం రూరల్ మండలం ఆలమూరులోని జగనన్న లేఔట్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు

గృహమస్తు..ప్రారంభమస్తు!

ఇల్లు లేదని చింత లేదు.. స్థలం ఉంది, ఇంటి నిర్మాణానికి స్తోమత లేదని దిగులు లేదు. అర్హత ఉంటే చాలు.. కులం లేదు, మతం చూడలేదు.. పార్టీలన్న భేదం అసలే లేదు.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసేందుకు శ్రీకారం చుట్టారు. నవరత్నాల పథకం పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఊర్లకు ఊర్లే నిర్మిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో లబ్ధిదారుల మోముల్లో వెలుగు నిండింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం :







‘సిద్ధం’ సభను విజయవంతం చేద్దాం

• నగరపాలక సంస్థ మేయర్ వసీం పిలుపు



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు

అనంతపురం కార్పొరేషన్: రాప్తాడులో ఈ నెల 11న జరగనున్న ఎన్నికల శంఖారావం సిద్ధం సభను విజయవంతం చేద్దామని మేయర్ పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి సిద్ధం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. నగరంలోని వివిధ డివిజన్ల నుంచి కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఆయా డివిజన్ల నుంచి జన సమీకరణకు కార్పొరేటర్లు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రానున్న ఎన్నికలోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంర్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, బాలాంజనేయులు, సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, లాలూ, సుజాత, నాయకులు రవీంద్ర రెడ్డి, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు పాటుపడాలి

• నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్



కార్మికుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్మికులు సురక్షిత ప్రమాణాలు పాటించి, నగర పరిశుభ్రతకు పాటుపడాలని కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. సోమవారం ఉదయం 5:30 గంటల సమయంలో నగరపాలక సంస్థలోని మూడో సర్కిల్ మస్టర్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో పాల్గొనే ముందు ఆరోగ్యంపై దృష్టి ఉండాలన్నారు. గ్లౌజులు, షూలు, ఇతర రక్షణ కవచాలను ధరించాలన్నారు. ప్రధానంగా నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రోడ్లపై చెత్త కనిపించకూడదన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కూడళ్లలో ఉన్న సేకరించిన చెత్తను కంపోస్టు యార్డుకు సకాలంలో తరలించాలన్నారు.

కార్యదర్శులకు నోటీసులు జారీ: విధులకు ఆలస్యంగా వచ్చిన వారికి కమిషనర్ చురకలు అంటించారు. అదే విధంగా పారిశుధ్య పర్యవేక్షణ చేపట్టని 45, 46, 48వ సచివాలయాల పారిశుధ్య కార్యదర్శులు నరసింహమూర్తి, మహబూబ్‌బాషా, హర్షవర్ధన్లకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జాబ్ చార్ట్ ప్రకారం కార్యదర్శులు విధులు నిర్వర్తించాల్సిందేనన్నారు. వైర్‌లెస్ సెట్ తీసుకొని రాని ఓ మహిళా పారిశుధ్య కార్యదర్శిపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. వైర్‌లెస్ సెట్‌ను ఇళ్లలో ఉంచి, విధులకు ఏవిధంగా గైర్హాజరవుతారని ప్రశ్నించారు. అనంతరం కమిషనర్ అరవింద నగర్, ఆదర్శనగర్, హమాలీ కాలనీ, నవోదయ కాలనీ, కలెక్టరేట్ ప్రాంతంలో కమిషనర్ పర్యటించారు.

సీమ జీవనవిధానానికి హెచ్చరిక ‘సాధన’



మాట్లాడుతున్న సాహితీ విమర్శకుడు డాక్టర్ కె. నాగేశ్వరాచారి

రాయదుర్గం రూరల్/కళ్యాణదుర్గం రూరల్: రాయలసీమ జీవన విధానం , దుర్భిక్ష పరిస్థితులపై ఒక హెచ్చరిక డాక్టర్ శాంతినారాయణ రచించిన ‘సాధన’ నవల అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు డాక్టర్ నాగేశ్వరాచారి అన్నారు. రాయదుర్గం మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం సాధన పరిచయ సభ నిర్వహించారు. రచయిత, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ బండి నారాయణస్వామి, కవి ఉప్పలపాటి వెంకటేసులు, కళాశాల కమిటీ సభ్యుడు బసవరాజు, అధ్యాపకుడు నారాయణ, విశ్రాంత అధ్యాపకుడు అయూబ్ ఖాన్ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గంలోని ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ‘సాధన’ నవల పరిచయ సభలో రచయిత డాక్టర్ శాంతి నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, తెలుగు శాఖాధిపతి ఎంటీ జ్యోత్స్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



నులి పురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 9న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, మంజుల, దిలీప్‌కుమార్, పద్మావతి తెలిపారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య పాల్గొన్నారు.

యాడికి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ కాశెప్ప, వైద్యాధికారులు విడుదల చేశారు. ఈ నెల 9వ తేదీన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీరాంకుమార్, పరమేశ్వర, దేవరాజన్, అప్పయ్య పాల్గొన్నారు.

క్షతగాత్రుల ప్రాణాలు కాపాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీఓ సురేష్‌నాయుడు

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం గుడ్ సమారిటన్ చట్టం–2016 తీసుకొచ్చిందని ఆర్టీఓ సురేష్‌నాయుడు తెలిపారు. సోమవారం రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల రూపంలో మనిషి ప్రాణాలు కోల్పోకూడదని, ఏ ఒక్కరూ కుటుంబ సభ్యులు కోల్పోరాదన్నదే ఈ చట్టం ఉద్దేశమన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి, వారు ప్రాణాలు కాపాడిన వారికి ఈ చట్టం ద్వారా ప్రోత్సాహక నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందించనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన గంటలోపు (గోల్డెన్ అవర్) ఆస్పత్రికి తరలిస్తే మనిషి ప్రాణాలు నిలబడే అవకాశం ఉందన్నారు. మానవతా దృక్పథంలో క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నారని నిరసన



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ విద్యార్థులతో ప్రాక్టికల్స్ పేరుతో డబ్బులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పరీక్షలను అవకాశంగా తీసుకున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు వసూళ్లకు తెర తీశాయన్నారు. ఇతర కళాశాలల నుంచి ప్రాక్టికల్స్ మార్కులు వేయడానికి లెక్చరర్స్ వస్తారని, వారికి డబ్బులు ఇవ్వాలి అని చెప్పి విద్యార్థులను ఒత్తిడి గురి చేస్తున్నారన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతరాయుడు, వంశీ, ఉమామహేష్, మంజు, ఆనంద్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, భీమేష్,సోము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మస్వామి జ్యోతుల ఉత్సవం

కనగానపల్లి: మండలంలోని తూంచర్లలో సోమవారం పెద్దమ్మ, నల్లమ్మ స్వాములకు జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. తర్వాతా గ్రామంలోని మహిళలు, యువతులు జ్యోతులు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాతా అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. నేడు ఊరి దేవర: తూంచర్ల గ్రామంలో మంగళవారం ఊరి దేవర ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దమ్మ తల్లితో పాటు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బలి తర్పణం చేస్తామన్నారు. ఉదయం 10 గంటల తర్వాతా గ్రామంలో విందు భోజనాలుంటాయన్నారు.

నేడు నిజపాద స్పర్శ దర్శనం

అనంతపురం కల్చరల్: స్థానిక రామనగర్‌లోని భవసార రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో విజయ ఏకాదశి సందర్భంగా మంగళవారం నిజపాద స్పర్శ దర్శనం ఉంటుందని భావసార క్షత్రియ సమాజ్ కార్యదర్శి ఆనంద మహేంద్రకర్, అధ్యక్షుడు తిరుపతిరావు దుస్తకర్ తెలిపారు. ఆలయంలో సోమవారం సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం నుంచి 10 గంటల వరకు స్వామి వారి దర్శనం ఉంటుందన్నారు.

రైల్వే తపాలా కార్యాలయం మార్పు

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఏళ్ల తరబడి కొనసాగిన రైల్వే తపాలా కార్యాలయం (రైల్వే మెయిల్ సర్వీస్–ఆర్ఎంఎస్) ఒకటో ప్లాట్ ఫాంలోకి మార్చినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా అనంతపురం రైల్వే స్టేషన్‌ను విస్తరించే కార్యక్రమం చురుగ్గా సాగుతోందన్నారు. రైల్వే స్టేషన్ సహా పరిసరాలను అందంగా తీర్చిదిద్దుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు నాల్గో ప్లాట్‌ఫాంలో కొనసాగిన రైల్వే తపాలా కార్యాలయాన్ని ఫస్ట్ రోడ్డు వైపున నూతనంగా నిర్మించిన ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు మార్చామని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని తెలిపారు.

రూ.7 కోట్లతో విస్తరణకు శ్రీకారం

దేశ వ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్లను అత్యంత ఆధునికంగా, ప్రయాణికుల అభిరుచికి తగ్గట్టు తీర్చిదిద్దుతున్నారు. అనంతపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.7 కోట్లతో శ్రీకారం చుట్టారు. నాల్గో ప్లాట్‌ఫాంను పూర్తిగా తొలగించే పనులు మొదలుపెట్టారు. ఇటువైపున ఉన్న భనాలను సైతం పూర్తిగా నేలమట్టం చేసి, అధునాతన సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించనున్నారు. ఆ పనులన్నీ ఇప్పుడు వేగవంతమవుతున్నాయి.

బీఎల్ఓ సస్పెండ్

అనంతపురం అర్బన్: ఓటర్ల జాబితాలో తప్పిదాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఒక బీఎల్‌ఓను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు కలెక్టర్ ఎం.గౌతమి ఉత్వర్వులను సోమవారం జారీ చేసినట్లు తెలిసింది.

మద్యం బాటిళ్ల పట్టివేత

పామిడి: పట్టణంలోని ఆముదాల వీధి, సంత మార్కెట్ వీధిలో సోమవారం రాత్రి సీఐ ఎం.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆముదాలవీధికి చెందిన షఫీ, సంతమార్కెట్ వీధికి చెందిన సుంకన్న ఇళ్లలో దాడి చేశారు. వారి నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాప్తాడు తహసీల్దార్‌గా సీతారామ్



తహసీల్దార్ సీతారామ్



టీవీ సుబ్రమణ్యం

రాప్తాడు: రాప్తాడు మండల నూతన తహసీల్దారుగా తిమ్మవాజల సీతారామ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లాలోని పుంగనూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించేవారు. బదిలీపై రాప్తాడు తహసీల్దారుగా వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు మునివేలు కర్నూలు జిల్లాలోని కల్లూరు మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ సీతారామ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, సేవలు అందిస్తామన్నారు. నూతన తహసీల్దారుకు అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

రూరల్ తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల తహసీల్దార్‌గా టీవీ సుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఈయన్ను ఎన్నికల నేపథ్యంలో ఇక్కడికి బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్మథరెడ్డి, పలువురు వీఆర్ఓలు తహసీల్దార్‌ను కలిసి బొకే అందించారు.

అర్బన్ తహసీల్దార్‌గా శివరామిరెడ్డి బాధ్యతల స్వీకరణ



శివరామిరెడ్డి

అనంతపురం రూరల్: అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా శివరామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఇక్కడ పని చేస్తున్న బాలకిషన్‌ను బదిలీ చేయగా, ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా తహసల్దార్‌గా పని చేస్తున్న శివరామిరెడ్డిని అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కనగానపల్లి ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి



కనగానపల్లి: కనగానపల్లి ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఓడీసీ నుంచి ఇక్కడికి బదిలీ చేశారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామన్నారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకారం అందించాలన్నారు.

క్షేమంగా ఇంటికి చేరుకున్న ముగ్గురు బాలురు

అనంతపురం: నగరంలోని నవోదయ కాలనీకి చెందిన ముగ్గురు బాలురు సోమవారం రాత్రి క్షేమంగా ఇంటికి చేరారు. కాలనీకి చెందిన అఖిల్ సాయి (12), అభిషేక్ (15), లక్ష్మీనందన్ (12) ముగ్గురూ కలిసి ఆడుకునేందుకు ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వరకూ ఇంటికి చేరుకోకపోయేసరికి తల్లిదండ్రులు ఆందోళనతో తెలిసిన చోటల్లా వెతికారు. అనంతరం బాలురు కనిపించలేదని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రికి ఇంటికి వచ్చేసరికి బాలుర తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. క్రికెట్ ఆడేందుకు వెళ్లి స్నేహితుల ఇంటి వద్దే ఉండిపోయి, మరుసటి రోజు ఇంటికి వచ్చారు. ముగ్గురు బాలురూ క్షేమంగా ఇంటికి చేరినట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ, ఊబిచెర్ల, కొత్తపేట, ఎంగిలిబండ, జక్కలచెరువు, ఇసురాళ్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ డిల్లేశ్వరి సోమవారం తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతం, రికార్డులను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఏసీ లావణ్య

గుంతకల్లుటౌన్: ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు విశాఖపట్నంలో జరగనున్నాయి. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు గుంతకల్లుకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు టీమ్ మేనేజర్లు వేణుగోపాల్, తబిత తెలిపారు. బాడ్మింటన్‌లో పురుషుల జట్టుకు పాల్ ప్రణీత్, సాయి అభిషేక్, మహిళా జట్టుకు శ్వేత, తన్మయి ఎంపికైనట్లు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్లు రామలింగప్ప, రామాంజనేయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.